

బర్కత్‌పుర రెడ్డి కళాశాల వద్ద ఓటర్ల సందడి



చాదర్‌ఘట్ చౌరస్తా కేడీయా కళాశాలలో ఓటు వేసిన మాజీమంత్రి, బీజేపీ నాయకుడు కృష్ణాయాదవ్



రెడ్ బిల్డింగ్ వద్ద ఓటు వేసిన మాజీ ఎంపీ హనుమంతరావు



కాలనీవాసులతో కలిసి ఓటు వేసిన ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్



హిమాయత్‌నగర్ ఉర్దూ హాల్‌లో ఓటు వేసిన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ వినోద్‌రెడ్డి దంపతులు

# ప్రశాంతంగా పోలింగ్

- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- ఆలస్యంగా ప్రారంభమైన ఓటింగ్
- ముషీరాబాద్‌లో 45 శాతం..
- అంబర్‌పేటలో 51 శాతం..

**ముషీరాబాద్ బృందం, మే 13 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నియోజకవర్గంలో 274 పోలింగ్ బూత్‌లలో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు ప్రశాంతంగా జరిగాయి. పోలింగ్‌కు ఉదయం ఏడు గంటల నుంచి 11 పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు అధిక సంఖ్యలో వచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు. 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మందకొండిగా పోలింగ్ బూత్‌లకు వద్దకు వచ్చారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు ఓటర్లు అధిక సంఖ్యలో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,07,995 ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,57, 610, మహిళలు 1,50, 373, ట్రాన్స్‌జెండర్లు 12మంది, యువ ఓటర్లు 4,868, సీనియర్ సిటిజన్ ఓటర్లు 3,419, దివ్యాంగులు 1, 764 ఉన్నారు. వీరికోసం నియోజకవర్గంలోని 105 భవనాల్లో 274 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆరుగంటల వరకు అందిన సమాచారం ప్రకారం నియోజకవర్గంలో దాదాపు 45 శాతం ఓటింగ్ జరిగింది. ఎన్నికల ప్రశాంతంగా జరిగేలా అన్ని పోలింగ్‌బూత్‌ల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలు చేశారు. ఓటింగ్ కేంద్రాలను సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్, బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యువజన నాయకులు ముఠాజైసింహ, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం అరవింద్‌కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్, డివిజన్ అధ్యక్షులు పెండం శ్రీనివాస్‌యాదవ్, పోతరాజు భాస్కర్ పరిశీలించారు.



కాచిగూడలో ఓటు వేయడానికి బారులుతీరిన ప్రజలు

## అంబర్‌పేట నియోజకవర్గంలో...

**బర్కత్‌పుర, నల్లకుంట, మే 13 (ఆంధ్రజ్యోతి):** అంబర్‌పేట నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కొన్ని పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించడంతో ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడానికి సెంటర్ల వద్ద బారులుతీరారు. నియోజకవర్గం పరిధిలోని అంబర్‌పేట, గోల్నాక, బాగ్‌అంబర్‌పేట, నల్లకుంట, కాచిగూడ డివిజన్లలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కాచిగూడ డివిజన్‌లోని నృపతుంగ కళాశాలలోని 220 పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభమైంది. ఓటు వేయడానికి వచ్చిన వారు గంట సేపు క్యూలైన్‌లో నిల్చోవాల్సి వచ్చింది. గంట ఆలస్యంగా ఇక్కడ పోలింగ్ ప్రారంభమైంది. బతుకమ్మకుంటలోని ప్రభుత్వ పాఠశాల 55వ పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు మొరాయించడంతో అర గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఆయన సతీమణి, కావ్య, కుమార్తె వైష్ణవితో కలిసి బర్కత్‌పుర దీక్షా మోడల్ స్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. మాజీమంత్రి, సి.కృష్ణాయాదవ్ చాదర్‌ఘట్ చౌరస్తా కేడీయా కళాశాలలోని పోలింగ్ సెంటర్‌లో ఓటు వేశారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆయన సతీమణి మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ, కుమార్తె డాక్టర్ దీప్తి, కుమరుడు మణికంఠలతో కలిసి తులసీనగర్‌లోని సెయింట్ పాల్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటు చేశారు.



అంబర్‌పేటలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## ఓటింగ్ ప్రజాస్వామ్య పండగ వంటిది

దేశాభివృద్ధి, భద్రత, సంక్షేమం కోసం ఓటు వేయాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ ఎన్నికలను ఓటు వేయడానికి ప్రజాస్వామ్య పండుగగా జరుపుకోవాలని పదే పదే చెప్పేవారని ఇది అక్షరాల ప్రజాస్వామ్యానికి సంబంధించిన పండగ అని అన్నారు. సోమవారం బర్కత్‌పుర దీక్షా మోడల్ స్కూల్‌లో ఓటు వేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో ఎన్నికలు గొప్పగా, పండగా జరుపుకుంటామని అన్నారు.



ఓటు హక్కు వినియోగించుకున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్

## బీఆర్‌ఎస్‌దే విజయం: పద్మారావు గౌడ్

సికింద్రాబాద్ ఎంపీగా విజయం సాధించడం ఖాయమని బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. భోలక్‌పూర్ డివిజన్ అంజుమన్ స్కూల్‌లోని పోలింగ్ బూత్‌ను సందర్శించి ఎన్నికల పనితీరును పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన పోలింగ్ కేంద్రం బయట విలేకరులతో మాట్లాడారు. మైనారిటీలు, హిందూవులు ఐక్యంగా కారు గుర్తుకు ఓటు వేశారని ఆయన అన్నారు. సికింద్రాబాద్‌లో గులాబీ జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రేటర్ యువ నాయకుడు ముఠా జైసింహా, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు రహీం, డివిజన్ బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రినుంచి నేరుగా ఓటువేయడానికి వచ్చిన వృద్ధురాలు



కార్మిక కమిషనరేట్‌లో ఓటు వేసేందుకు వచ్చిన 92 సంవత్సరాల వృద్ధుడు



తన ఓటును తొలగించారని ఆవేదన వ్యక్తం చేస్తున్న ఆదిలక్ష్మి



వృద్ధురాలిని ఓటు వేయడానికి తీసుకువస్తున్న చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య



తన ఓటును తొలగించారని ఆందోళన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు అశోక్ కుమార్



సత్యవాణికి పురస్కారం బహూకరిస్తున్న రమణాచారి

## అమ్మ ప్రేమకు కొలమానం లేదు

**చిక్కడపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి):** అమ్మ ప్రేమకు కొలమానం లేదని మాజీ ఐఏఎస్ అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. అభినందన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా సాంఘిక సేవా కర్త సత్యవాణికి సంస్థ స్థాపకులు భవాని మాతృమూర్తి మాదిరాజు వరలక్ష్మి స్మారక పురస్కారం ప్రదానం చేశారు. ప్రఖ్యాత గాయకుడు డీవీ మోహనకృష్ణ అమ్మ కుసుమకు, ప్రముఖ గాయని విజయలక్ష్మి అమ్మ సుగుణకు మాతృవందనం పేరిట సత్కారం చేశారు. డా.రమణాచారి మాట్లాడుతూ సత్యవాణి భారతీయ వాణిగా మన దేశ సంస్కృతిని ప్రచారం చేస్తున్నారన్నారు. సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, కేవీ కృష్ణకుమారి, విజయానందకృష్ణ, ఇందిరావిజయ్, ధనుంజయ్ పాల్గొన్నారు.

**చిక్కడపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి):** మాతృప్రేమ అమృతంకంటే గొప్పదని ప్రముఖ కవి చిక్కా రామదాసు అన్నారు. మాతృదేవోభవ సత్సంగ్‌సంస్థ అధ్యక్షుడు కేబీ శ్రీధర్‌ను సోమవారం సూర్యలోక్ కాంప్లెక్స్ పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో రామదాసు సన్మానించారు.

## బీటెక్ చదివాడు.. బెట్టింగుకు బానిసయ్యాడు..

- గొలుసు కాజేసిన యువకుడి అరెస్ట్

**పంజాగుట్ట, మే 13 (ఆంధ్రజ్యోతి):** బీటెక్ చదివాడు.. ఉద్యోగం కోసం నగరానికి వచ్చాడు. ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటూ.. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసయ్యాడు. అప్పుల పెరిగి డబ్బుల కోసం ఓ ఇంట్లో చొరబడి వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు దోచుకెళ్లిన నిందితుడిని పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి నాలుగు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం దొప్పలపూడి గ్రామానికి చెందిన కొండేటి నాగపృథ్వీ (23) బీటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగం నిమిత్తం గత ఏడాది నగరానికి వచ్చాడు. ఎల్లారెడ్డిగూడలోని ఓ బాయిస్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్స్‌కు బానిసై అప్పుల పాలయ్యాడు. డబ్బుల కోసం చోరీ చేయాలని భావించి ఈ నెల 12న ఎల్లారెడ్డిగూడ శాలివాహననగర్ కాలనీలోని నివాసం ఉంటున్న విజయలక్ష్మి(75) ఇంట్లోకి దూరాడు. వంట గదిలో వంట చేస్తున్న ఆమె మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నాగపృథ్వీ హాస్టల్‌కు వెళ్లి అతని వివరాలు సేకరించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. దోపిడీ చేసిన బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని అతన్ని రిమాండ్‌కు తరలించారు.

### బైక్ పెట్రోల్‌ట్యాంక్ పేలిన ఘటనలో

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మొహమ్మద్ నదీమ్ (ఫైల్)

**చార్మినార్ మే 13 (ఆంధ్రజ్యోతి):** బుల్లెట్ బైక్‌కు మంటలు అంటుకుని పెట్రోల్ ట్యాంక్ పేలిన ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న మొఘల్‌పురా సుల్తాన్ షాహీకి చెందిన మహమ్మద్ నయీమ్ కుమారుడు మహమ్మద్ నదీమ్(32) చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. భవానినగర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం సాయంత్రం మొఘల్‌పురాలోని నాజర్ ఫంక్షన్‌హాల్ వద్ద బుల్లెట్ బైక్‌కు మంటలంటుకోగా స్థానికులు నీటిని చల్లుతూ తడిచిన గోనె సంచులు వేసి ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో బుల్లెట్ పెట్రోల్ ట్యాంక్ పేలి పదిమంది గాయపడిన విషయం తెలిసిందే. చికిత్స పొందుతున్న వారిలో నదీమ్ మృతి చెందగా.. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. నదీమ్ మృతదేహానికి పోస్టమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.



అనంతరాంరెడ్డినగర్‌లో ఓటు వేసిన బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి దంపతులు



బహదూర్‌యార్ జంగ్ పోలింగ్ బూత్‌లో ఓటు వేసిన సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ దంపతులు



గగన్‌మహల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సభ్యులు



దోమలగూడలో ఓటు హక్కు వినియోగించుకున్న బీజేపీ మాజీ కార్పొరేటర్ రవీందర్, కుటుంబ సభ్యులు

## 'మార్మికనది' ప్రజాచైతన్య కవితా ప్రవాహం

- ఆచార్య కొలకలూరి ఇనాక్

**రాంనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి):** ప్రముఖ కవి డాక్టర్. బిక్కి కృష్ణ రచించిన మార్మికనది కావ్యం ఒక ప్రజాచైతన్య ప్రవాహమని, దీనికి కేంద్ర సాహిత్య అకాడమి వచ్చి తీరాలని ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. విశాల సాహితీ, భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో చిక్కడపల్లి కళాభారతిలో సోమవారం ప్రముఖ కవి డాక్టర్. బిక్కి కృష్ణ రచించిన మార్మికనది కావ్యంపై సమీక్ష సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బిక్కి కృష్ణ కవిత్వం, పరిశోధనలు, సాహిత్య సేవలు అనితర సాధ్యమని కొనియాడారు. కవి గోరేటి వెంకన్న మాట్లాడుతూ ఏ కొలమానాలకు అందని స్వచ్ఛమైన కవి, పాశ్చాత్య సాహిత్య సిద్ధాంతాలను ఆకళింపు చేసుకుని నిఖార్సయిన విమర్శాగ్రంథాలు వెలువరించిన మంచి విమర్శకుడు బిక్కి కృష్ణ అని ప్రశంసించారు. ప్రసిద్ధ కవి డాక్టర్. నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ మార్మికనది వస్తుశిల్పశోభితమైన గొప్ప కావ్యమన్నారు. అందులో ప్రతి పేజీలో లోతైన తాత్వికతతోపాటు భావుకత, ప్రతీకాత్మకత, అభివ్యక్తినవ్యత గోచరిస్తుందన్నారు. ప్రముఖ కవి విద్యాధర్ మాట్లాడుతూ శైవకవుల, బసవేశ్వరుని సంఘ సంస్కరణ బిక్కి కృష్ణను ప్రభావితం చేశారన్నారు. రచయిత్రి రోహిణి వంజారి మార్మికనది పుస్తకాన్ని సమీక్షించారు.



డాక్టర్ బిక్కి కృష్ణ రచించిన మార్మికనది కావ్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరులు

ప్రముఖ అనువాదకులు ప్రొఫెసర్ జీవీ రత్నాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కుసుమధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు రాధా కుసుమ, బహుజన సిద్ధాంతకర్త బీఎస్. రాములు, ప్రముఖ కన్నడ అనువాదకులు లక్కూర్ ఆనంద్, కె. రవీంద్రాచారి, టి. రంగస్వామి, ఆంగ్లానువాదకవి దామోదరాచారి, యాంకర్ పద్మశ్రీలత, పెద్దూరి వెంకటదాసు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాలు

**భెల్‌కాలనీ, మే13 (ఆంధ్రజ్యోతి):** బీహెచ్ఇఎల్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర, యోగేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని నిర్మించి, విగ్రహాలను ప్రతిష్ఠించి 55 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా వేడుకలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిత్యపూజతో పాటు, అభిషేకాలు శాస్త్రోక్తంగా జరిగాయి. శ్రీనివాసునికి మూలమంత్ర హోమం, మహాసుదర్శన హోమం, శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం నిత్యహోమం, పారమాత్మిక హోమం తదితర పూజలు చేశారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను గరుడవాహనం వాహనంపై అలంకరించి దేవాలయ ప్రాంగణంలో ఊరేగించారు. దేవస్థాన ప్రధానార్చకులు రామకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో ఆలయ కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



మొట్టమొదటి సారి ఓటు హక్కును వినియోగించుకున్న అన్విత్‌రాజ్

భోలక్‌పూర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న యువతులు

## బీఆర్‌ఎస్ నాయకుల మధ్య ఆదిపత్యపోరు

- డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డిపై దాడి
- పరామర్శించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్

**ముషీరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి):** ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకుల మధ్య ఆదిపత్యపోరు తారాస్థాయికి చేరుకుంది ఇరువర్గాల నేతలు పరస్పరం దాడులకు పాల్పడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... ముషీరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎడ్ల భాగ్యలక్ష్మి హరిబాబు యాదవ్, వారి కుమారులు డివిజన్‌లో పోలింగ్ బూత్‌ల వారిగా సీనియర్‌ల ఎంపిక, డబ్బుల పంపిణీపై ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డి మధ్య విభేదాలు చోటు చేసుకున్నాయి. రెండు రోజులుగా ఇరువురి మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్నది. ఎన్నికల నేపథ్యంలో సోమవారం రాంనగర్ సెయింట్‌పాయిస్ స్కూల్ సమీపం వద్ద మాజీ కార్పొరేటర్ కుమారులు కొండా శ్రీధర్‌రెడ్డితో మాట్లాడుతున్న క్రమంలో గొడవ జరిగింది. శ్రీధర్‌రెడ్డిపై దాడి చేయడంతో ఆయన ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై మాజీ కార్పొరేటర్ ఎడ్ల హరిబాబు యాదవ్ కుమారులు అకారణంగా దాడి చేశారని లిఖిత పూర్వంగా శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువురిని ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు పోలీసులు పిలిపించి మాట్లాడారు. తాను కేసు విరమించుకోనని శ్రీధర్‌రెడ్డి మొండిపట్టు పట్టడంతో బీఆర్‌ఎస్ నాయకులు వారికి సర్దిచెప్పారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ముఠా జైసింహా, ఐదు డివిజన్ల బీఆర్‌ఎస్ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు కొండా శ్రీధర్‌రెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. గొడవకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

### దాడి చేయలేదు: హరిబాబు యాదవ్

శ్రీధర్‌రెడ్డిపై తమ కుమారులు దాడి చేయలేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్ అన్నారు. తమ కుమారులు శ్రీధర్‌రెడ్డితో మాట్లాడారు దాడి చేయలేదని పేర్కొన్నారు. కావాలనే తమపై కేసు పెట్టారన్నారు.



ఒకేసారి ఓటు హక్కు వినియోగించుకున్న పూసరాజు ఉమ్మడి కుటుంబ సభ్యులు 60 మంది ఓటర్లు

## ఓటుహక్కును వినియోగించుకున్న ఉమ్మడి కుటుంబం

**రాంనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి):** ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్‌లోని జెమిని కాలనీలో నివాసం ఉంటున్న పూసరాజుకు సంబంధించిన ఉమ్మడి కుటుంబ సభ్యులు 60 మంది సోమవారం ఉదయం రాంనగర్‌లోని సెయింట్ పాయిస్ హైస్కూల్‌లో గల 187వ పోలింగ్ బూత్‌లో కలిసి కట్టుగా వచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఒకేసారి ఉమ్మడి కుటుంబ సభ్యులు అందరూ వచ్చి ఓటింగ్ పాల్గొన్న అంశం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ సందర్భంగా పూస రాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు విలువకాపాడాలనే లక్ష్యంతో తమ కుటుంబంలో సభ్యులందరూ ఓటుహక్కును ఒకేసారి వినియోగించుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. 60 మంది ఒకేసారి వచ్చి ఉమ్మడిగా ఓటు వేసి నియోజకవర్గంలో ప్రత్యేకతను చాటుకున్నారు.